# ఇదీ - కథ

‘ఏంమామా ! యీ నెలఅంతా మనకు అఖండ రాజయోగం. జన్మలగ్నానికి ఫలితం శత్రునాశనం అని కూడా అన్నాడేంఓయ్! ఇదుగో, వెళ్ళి, ఆ... కోడు కున్నాడే, వాడితో ‘ఖబడ్దార్’ నీ గుండెల్లో నిద్రపోతా” నని చెప్పివస్తా - శుభం—’

రోజూ, నాకు ఆ పనసవినడం అలవాటైపోయింది. కాని అప్పుడే రైలుదిగివచ్చిన ఆ స్నేహితుడికి అందులో వున్న గుండెకోత ఏం తెలుస్తుంది? ఏమిటి ఆ వాలకం, ఎవరు ఆ మనిషి, ఏమిటి ఆ మాటలకు అర్థం? అనుకుని తెల్ల పోతూ, ఏమీ అడగలేక, ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

ఆతన్ని సముదాయించటానికని, మళ్ళా ఓమారు ఆ కథఅంతా ఏకరువుపెట్టాలి—

—పాపం, ఆతడు చాలా మంచివాడోయ్, నోట్లో నాలుకలేనంతటి అమాయకుడు. నలుగురికీ తలలోనాలుక లాగా మెలగుతూ, ఒక జోలీ శొంఠీ అక్కరలేకుండా, పది మంది సంపన్నగృహస్థులయిళ్ళల్లో పౌరోహిత్యంచేసు కుంటూ, నాలుగుడబ్బులు కూడవేసుకుంటూ, ఓ యింటి వాడై యింటిపట్టున సుఖంగా కాలక్షేపంచేస్తూండేవాడు.

—నిజంగా అవసరం ఏమీలేదు సుమా? అదివరకు ఎన్నడూ అలాటి వెర్రిమొర్రినమ్మకాలు ఉన్నాయో, లేవో

కూడాను. కుడిచికూర్చుని ఊరక ఉండలేనట్టుగా, రామన్న ఊళ్ళోకి ఎవడో కొత్తజోషీ దిగేటప్పటికి, తన జాతకం చూపించుకున్నాడు: అక్కడితో మునిగింది.

ఆ అప్రాచ్యుడు — వాడెవడో బిళ్ళకుడుముల్లాగ రెండురూపాయలు చేతుల్లో వేయించుకుని — ద్వికళత్ర యోగం ఉన్నదని చెప్పాడు. రామన్న నిలువునా నీళ్ళుకారి పోడూ!

ఇక, అక్కడనుంచీ చూసుకో, కాలుకాలిన పిల్లి లాగా, తందనాలుతొక్కడం మొదలు! పోనీ ఎవరితోనైనా మనసువిప్పి, 'ఇలాటి ఆపదవచ్చేట్టుంది, ఏమిటి ఉపాయం?' అని అడిగినా బాగుండిపోను. రండాగర్భంచేసి కప్పిపెట్టాడు. నాలుకదాటిందంటే నాలుగువాడలూదాటి, తన యిల్లాలి చెవిని ఎక్కడపడుతుందో, ఆ వార్త వినగానే ఆ అమ్మాయి అప్పుడే గుటుక్కుమంటుందేమోనని, నోరునొక్కుకుని — సొంతవైద్యం మొదలుపెట్టాడు.

హరి : ఓం అంటూ ఆదిలోనే పెద్ద హంసపాదు వచ్చింది. సిసలైన శ్రోత్రియుడు, పరాయి ఆడదానికేసి కన్నెత్తి చూడటమన్నా అలవాటులేనివాడు, చూస్తూ చూస్తూ ఒక్కసారిగా, — ఎంత తెగించినా — గంగలో ఎలా ఉరుకుతాడు? అందువల్ల, నాలుగురోజులు నానామూరా ముళ్ళాపడి, ఏలాగైనా, తనయింట దీపంనిలుపుకోవాలని,— కొంచెం గడుసరిగా అనుకుని — ఓ పన్నాగంలోకి దిగాడు.

అంతవరకూ చక్కని అనుకూలదాంపత్యం, చిలకా గోరింకలాగా చూడముచ్చటఅయేది ఉభయులనూ. ఒక్క-

సారిగా కటికకోరంటికంలోకి దిగి, ఆమెవంకన్నా చూడ కుండా, కాల్చుకుతినడం ప్రారంభించాడు. కొంతకాలమైనా అలా—అంటిముట్టకుండా, పరాయిదానికన్నాకూడా కనా కష్టంగా చూస్తే - తనగుండెలు ఎంత కుమిలిపోయినా - తనభార్య బ్రతికి బాగుంట్నుందికదా అని ఆ బ్రాహ్మణుడి ఆశ:

అది ఆ చిన్నదానికి ఏం అర్థమౌతుంది? మొదటి రోజు కసిరి కరవవచ్చినట్టుగా మీదకువస్తే, చెంపకు చారెడు కళ్లుచేసుకుని బెదిరిపోయినా, అప్పటికేలాగో - ఏదో చిరా కుగావుండి అలా మండిపడుతున్నాడని - సమాధాన పరచు కుని ఊరుకుంది; కాని, రోజూ ఎప్పటికప్పుడు అదేతంతు అయేటప్పటికి బెంగతో, హడలిపోయి మంచం ఎక్కింది.

అక్కడితోనైనా, కళ్ళుతెరచి, రామన్న పిచ్చివేషం వేయకుండావుంటే బాగుండిపోనేమో? ఏంచేశాడను కున్నావు? ఆ ఉపశాంతికి గ్రహచారం లొంగకపోగా, నెత్తి అణచడానికి కూర్చున్నట్టుంది, అందుకనే, నిక్షేపంలాంటిది అలా లోజెడిపోతూన్నది, ఇక తామసించకూడదు, అని నడుం కట్టుకుని, - లోతుగా మునిగాడు.

అవును మరి, ఇక ఊరుకుంటాడా, పరమేశ్వరుడిమీద భారంవేసి, పదిరోజులు ఉడుకుడుచుకుని, చివరకు సాహ సించి, పళ్ళుబిగివిని, ఏలాగైతేనేం, పనిచేసే మంగాయే అని వుందిలే - ఆనక చూపిస్తానుండు-దానిమీద చేయివేశాడు. అవును అంతకన్న ఎక్కడికి వెతుక్కుంటూపోతాడు. అలాటి కార్యకలాపానికి తూర్పేదో పడమరఏదో అదివర

కెన్నడయినా ఎరుగున్న పాపాన పోయివుంటేనా? అందు బాటులో వున్నది — అది వాడి పూర్వసుకృతంకొద్దీ - అందింది.

ఇక పీడ వదలిపోయిందికదా అని ఎగిరి గంతులు వేశాడంటే నమ్మ.

మూడునాళ్ళ పట్టపగలు - ఏలాగో మొక్కు తీర్చుకుని బయటపడ్డాడనుకో. అసలు రెపరెపఅంతా అందుకుకాదుగా- మంచిరోజు చూసి - మళ్ళా యింట్లోమంచం దులిపాడు.

ఒకరోజు, రెండురోజులు- ఆ అమ్మాయి ఏ మాత్రమూ తేరుకోకపోవడం అలా ఉండగా, మరీ, కారు కమ్ముకుని, దిగనాసిల్లిపోయింది. అప్పటికైనా మేలు కున్నాడా! తగిన ఉపశాంతిజరిగిందికదా - అనేధైర్యంతో దానంతటఅదే, భారకంతగ్గి లేచి తిరుగుతుందని — జబ్బు ఒకటైతే-వైద్యం ఒకటిగా లంకణాలుకట్టి మాడ్చి చివరకు, అత్తవారికి కబురుచేశాడు.

మామగారు వచ్చిరావడంతోనే వైద్యుణ్ణి పిలుచుకు వచ్చి చూపించాడు. అతడు ఆయనను చాటుకుతోసుకు వెళ్ళి, ఏంచెప్పాడో! ఆయన, రామన్నతో మళ్ళా పలు విప్పకుండా, తన భార్యచేత చెప్పించి, ఇక అక్కడ గంగ ముట్టకుండా, ఆపూటే కూతురిని, తనఊరు తీసుకువెళ్ళి పోయినాడు.

—వారంరోజులు అయినా, అక్కడనుంచీ ఏ కబురూలేదు. మనసుపట్టలేక, రామన్న తానుకూడా రైలు ఎక్కాడు. గుమ్మంలో అడుగు వేసేటప్పటికి ఏలాగు ఉన్న

దిటాస్థితి — ఇల్లంతా ఆలగోలు బాలగోలు. అప్పుడో కాస్సేపో —

అంత గంగిగోవులాంటి సాధువు - అమాంతం ఆ మామగారిమీద విరుచుకుపడ్డాడు, 'అంత ముంచుకువచ్చినా తనకు కబురెందుకుచేయలే'దని. ఆయన ఉగ్రుడైపోయి, 'చేసిన నిర్వాహకం చాలక ఏ ముఖంపెట్టుకు నా గడప త్రొక్కుతావని కబురుచేస్తాను ?' అనగానే, రామన్న సగం చచ్చి, గుడ్లనీరు కుక్కుకుంటూ, - భార్య మంచందగ్గిరకు వెళ్ళాడు. చుట్టూ ఎవరెవరో కూర్చునిఉన్నారు. ఎవరూ వైదొలగి ఆతన్ని దగ్గిరకువెళ్ళనీయలేదు. అంతదూరంగా అలా నిలుచున్నాడు.

—తల్లివంక చూస్తూన్నది అంతసేపూ - అలికిడికి కాబోలు నెమ్మదిగా మెడ ఆతడున్న వేపు తిప్పి -పెనిమిటి కంటపడగానే - అంత నీరసంలోనూ మెడవిరుగుతుందేమో అన్నంత దుడుకుగా తల విసిరిత్రిప్పుకొని - విపరీతంగా మూలిగింది. అందరూ, ఆతని వేపు తిరిగి - బాకుల లాటి చూపులతో గ్రుచ్చి గ్రుచ్చి అక్కడనుంచి తరిమేశారు.

—రామన్న వచ్చేసినతరువాత ఒకగంట మాత్రం ఆమెకు ఊపిరిఉన్నదట—

అంతటితో పోయిందనుకున్నావా ? ఆ వరుసవరుస-రామన్న మూడు నెలలు ఆస్పత్రిలోఉండి — మళ్ళా తల్లి కడుపున పుట్టాడనుకో : ఆతడి పాపం-కొంచెం ఆలస్యంగా ఫలించింది— అప్పట్లో రాలిపోయినా —అదృష్టవంతుడే.

—ఒకరిని ఓ మాట అనడు పలుకనడు. ఎప్పుడూ ఒక టేధోరణి 'గ్రహబలం' : అలా అనుకోవడమే ఆ వెర్రికి బలం. అసలుసంగతే గ్రహించే మతిఉంటేనా—అసలు గుండెలాడేనా ?

ఇప్పుడు ఇదోమాదిరి—ఏ పత్రికో చదివి-పంచాంగం చూశో—నెలవారీ, రోజువారీఫలితాలు కట్టుకోవడం—అది యింటింటా చెప్పిరావడం : విన్నావుకదూ "శత్రు నాశనం" అట. శత్రువు ఎవరో తెలుసునా, ఆ...కొడుకన్నాడు ?—మామగారు.

ఇదీ—కథ.

—[o]—